సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



వర్షంలోనూ సైక్లోథాన్

వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నావికాదళ సైక్లిస్టులు బీచ్‌రోడ్డులో కండిషనింగ్ క్యాంప్‌లో పాల్గొన్నారు. 8లో



సినీ హీరో నాగార్జున సందడి

నగర పరిసర ప్రాంతాల్లో షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆదివారం విశాఖ వచ్చారు. 8లో



సీతమ్మధార : వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి ఆదివారం బాలగణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కుండపోత



నీటమునిగిన అల్లిపురం ప్రాంతంలోని బొడారా రోడ్డు

తెరిపివ్వని వర్షంతో జలమయమైన లోతట్టు ప్రాంతాలు

నగరంలో 100 మి.మీ వర్షపాతం నమోదు

- బిక్కుబిక్కుమంటున్న కొండవాలు ప్రాంత ప్రజలు
- కలెక్టరేట్‌తో పాటు 11 మండలాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- జీవీఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టోల్‌ఫ్రీ నంబర్
- 10 గంటల పాటు పర్యవేక్షించిన మేయర్ హరివెంకట కుమారి
- తమ పరిధిలోని కళాశాలలకు సెలవు ప్రకటించిన ఏయూ



సింహగిరి మెట్లమార్గంలో నీటి పరవళ్లు

సింహాచలం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింహగిరి మెట్లమార్గంలో పెద్ద ఎత్తున నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది. మెట్లమార్గంలో ఉన్న సాగిధార, ఆకాశ ధారలు పరవళ్లు తొక్కుతున్నాయి. అలాగే కొండలపై నుంచి పెద్ద ఎత్తున వర్షం నీరు మెట్లమార్గంలోకి వచ్చి చేరుతోంది. దీంతో మెట్లమార్గంలో సింహగిరికి వెళ్లే భక్తులు నీటి ప్రవాహాన్ని చూసి తనివితీరా ఆస్వాదించారు.



సింహగిరిపై వర్షపు నీటి ప్రవాహం

గ్రేటర్ పరిధిలో వర్షం సృష్టించిన నష్టమిదీ...

నష్టం వాటిల్లిన జోన్లు	6
ధ్వంసమైన రహదారులు	14.25 కి.మీ
ధ్వంసమైన ఓపెన్ డ్రైన్లు, యూజీడీ	3.85 కి.మీ
ధ్వంసమైన మంచి నీటి పైప్‌లైన్లు	400 మీటర్లు
పాడైన వీధిదీపాలు	63
నష్టం వాటిల్లిన జీవీఎంసీ స్కూల్స్, భవనాలు, కమ్యూనిటీ సెంటర్లు	3
మొత్తం నష్టం	రూ.15.52 కోట్లు

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్
0891-2590102, 0891-2590100

పోలీస్ కంట్రోల్ రూమ్
0891-2565454

జీవీఎంసీ కంట్రోల్ రూమ్
1800 4250 0009

సాక్షి, విశాఖపట్నం: వర్ష బీభత్సంతో జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా మారి.. ఒడిశా, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ వైపుగా ఉన్నప్పటికీ.. విశాఖపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా జలమయమైంది. రూరల్ మండలాల్లో పొలాలు నీట మునిగాయి.. పలు చోట్ల రహదారులు ఛిద్రమయ్యాయి. నదులు, వాగులు, గెడ్డలు వరద నీటిని తమలో నింపేసుకొని ఉధృతంగా ఉరకలెత్తుతున్నాయి. వరద నీటి ప్రవాహం సృష్టించిన విలయానికి పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. వాయుగుండం ముప్పు ఇక్కడ లేకున్నా.. దాని ప్రభావం సోమవారం సాయంత్రం వరకూ కొనసాగుతుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. మహా విశాఖ నగరం వరద నీటిలో విలవిల్లాడిపోయింది. అలల ఉధృతితో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లొద్దంటూ హెచ్చరించారు. వాతావరణ హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్ని మండలాల తహసీల్దార్లను, అధికారులను అప్రమత్తం చేసి పలు ఆదేశాలు, సూచనలిచ్చారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఎప్పటికప్పుడు గమనించి.. అవసరమైన చోట వరద నీటిని విడుదల చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులను సూచించారు. ఎక్కడైనా రాకపోకలకు అవాంతరాలు ఎదురైతే వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.



సంగివలస సర్వీస్‌రోడ్డులో నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



కాన్వెంట్ జంక్షన్ వద్ద నిలిచిన వరద నీటిలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు

వర్షపాతం వివరాలు (మి.మీ)

ప్రాంతం	7వ తేదీ	8వ తేదీ
గంభీరం	75.25	53.5
ఆరిలోవ	67.25	51.75
కాపులుప్పాడ	64.75	50.5
పెదగంట్యాడ	42.0	56.75
గోపాలపట్నం	45.25	57.0
పెందుర్తి	43.75	57.25
వేపగుంట	43.25	50.0
సుజాతనగర్	42.0	48.75
గాజువాక	39.5	57.2
బుచ్చిరాజుపాలెం	39.25	48.25
పద్మనాభం	38.0	47.5
పెదవాల్తేరు	30.3	41.0



గ్రేటర్ పరిధిలో 80 పునరావాస కేంద్రాలు

విశాఖలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారుల్ని ఆదేశించారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో ఉన్న కమిషనర్ వర్షాల నేపథ్యంలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే జీవీఎంసీ పరిధిలో అన్ని జోన్లలో 10,620 మందికి సరిపడేలా 80 పునరావాస కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. వర్షాల బాధితులుగా 14,630 కుటుంబాలను గుర్తించినట్లు అధికారులు వివరించారు. రిటైనింగ్ గోడలు లేని చోట నివసించే వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు ఇంజనీర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ గెడ్డలు, కాలువలు పొంగిపొర్లకుండా ముందస్తుగా గుర్తించి వాటిని కట్టడి చేసేందుకు తగిన ఏర్పాట్లను చేయాలన్నారు.



రిజర్వాయర్ల నీటిమట్టం

రిజర్వాయర్	గరిష్ట నీటిమట్టం	ప్రస్తుతం
ఏలేరు	86.56 మీటర్లు	84.90 మీ.
తాటిపూడి	297 అడుగులు	290.20
రైవాడ	114 మీటర్లు	109.25 మీ
మేహాద్రిగెడ్డ	61 అడుగులు	51.10 అ.
గోస్తనీ	35 అడుగులు	29 అ.
గంభీరం	126 అడుగులు	123 అ.
ముడసర్లోవ	169 అడుగులు	162.7 అ.

విద్యా సంస్థలకు సెలవు, గ్రీవెన్స్ రద్దు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కలెక్టరేట్, జీవీఎంసీలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఏయూ వీసీ తెలిపారు.

కంట్రోల్ రూమ్‌ల వివరాలు

తహసీల్దార్ కార్యాలయం	కంట్రోల్‌రూమ్
ఆనందపురం	9700501860
భీమిలి	9703888838
పద్మనాభం	7569340226
పెందుర్తి	7702577311
చినగదిలి	9703124082
సీతమ్మధార	8500633988
మహరాణిపేట	9182807140
గోపాలపట్నం	7842717183
ములగాడ	9440552007
గాజువాక	8886471113
పెదగంట్యాడ	9948821997

తాటిపూడి గేట్ల ఎత్తివేత

తాటిపూడి రిజర్వాయర్‌కు వరద నీరు భారీగా చేరుతూ ప్రమాదకరస్థాయికి చేరుకుంటోంది. గరిష్ట స్థాయికి మించి ఇన్‌ఫ్లో వస్తుండటంతో అధికారులు గేట్లు ఎత్తారు. ఈ నేపథ్యంలో భీమిలిలో ప్రజలకు కావలసిన పునరావాస కేంద్రాలను జీవీఎంసీ అధికారులు సిద్ధం చేశారు. నీటి ఉధృతిని అంచనా వేసి గోస్తనీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



మద్ది ఆనకట్టపై నుంచి ప్రవహిస్తున్న గోస్తని నీరు

భయం గుప్పిట్లో కొండవాలు



కంచరపాలెం వద్ద కూలిన స్కూలు ప్రహరీ



రామకృష్ణానగర్‌లో విరిగిపడిన కొండచరియలు

వర్షాల కారణంగా కొండవాలు ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే కైలాసపురం, మల్కాపురం, హనుమంతువాక గిరి ప్రదక్షిణ రోడ్డులో కొండ చరియలు విరిగిపడ్డాయి. గోపాలపట్నం మెయిన్ రోడ్డులోని కొండవాలు ప్రాంతం కోతకు గురవ్వడంతో.. 20కిపైగా ఇళ్లు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. అప్రమత్తమైన పోలీస్, జీవీఎంసీ అధికారులు ఇళ్లను ఖాళీ చేయించి.. ప్రజల్ని గోపాలపట్నం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వీటి పక్కనే ఉన్న మరో 15 ఇళ్లకు ప్రమాదం పొంచి ఉందని గ్రహించి.. వారిని కూడా ఖాళీ చేయించారు. సీతకొండ వద్ద బండరాళ్లు బీచ్‌రోడ్డుపై పడటంతో.. ట్రాఫిక్‌ని సింగిల్ లైన్‌కు పరిమితం చేశారు. పలు చోట్ల రక్షణ గోడలు కూలి వాహనాలు దెబ్బతిన్నాయి. గొల్ల కంచరపాలెం రైల్వే రక్షణ గోడ కూలడంతో కారు, రెండు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. భారీ వర్షాలకు సీబీఎం కాంపౌండ్‌లో ఓ అపార్ట్‌మెంట్‌కు చెందిన భారీ ప్రహరీ కుప్పకూలింది. గంగవరంలోని బడేవారి వీధిలో ఓ పెంకుటిల్లు కుప్పకూలిపోయింది.

మేయర్ విస్తృత పర్యటన



కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మేయర్

భారీ వర్షాల నేపథ్యంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఆదివారం ఉదయం నుంచి దాదాపు 10 గంటల పాటు నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జోన్-3, 5ల్లో పొంగిపొర్లుతున్న ఎర్రిగెడ్డ, పెదజాలారిపేట బీచ్‌ను పరిశీలించారు. ఎర్రిగెడ్డలో వ్యర్థాలను పరిశీలించి వెంటనే పొక్లెయిన్లతో తొలగించి గెడ్డ పొంగిపొర్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీచ్‌లో గణేష్ నిమజ్జనాల వ్యర్థాలను వెంటనే తొలగించాలని, ఏర్పాట్లను మరింత పటిష్ఠం చేయాలని అదనపు కమిషనర్ రమణమూర్తికి సూచించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ ఆపరేషనల్ సెంటర్‌ని చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. వర్షాల కారణంగా ప్రజల నుంచి వచ్చిన 7 ఫిర్యాదుల్లో పరిష్కరించిన వాటిపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న కుటుంబాలు ఇళ్లను ఖాళీ చేసి.. సమీపంలో ఉన్న సచివాలయాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.



పోర్టు వద్ద పేరుకుపోయిన చెత్తను పొక్లెయిన్‌తో తొలగింపజేస్తున్న మేయర్

గణేష్ నిమజ్జనాలకు జీవీఎంసీ ఏర్పాట్లు

డాబాగార్డెన్స్: నగరంలోని సముద్ర తీర ప్రాంతంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు జీవీఎంసీ తగిన ఏర్పాట్లు చేసింది. ఈ ఏర్పాట్లను ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఆదివారం పరిశీలించారు. భీమిలి బీచ్, మంగమారిపేట బీచ్, గోస్తనీ నది పాత వంతెన, చిల్లపేట చెరువు, జోడుగుళ్లపాలెం బీచ్, సాగర్‌నగర్, వీఐటీ జంక్షన్ బీచ్, యారాడ, నరవ, పెదజాలారిపేట, నేవల్ క్యాంటీన్ బీచ్, అప్పికొండ, శారదా ఘాట్ ప్రాంతాల్లో గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసుకునేందుకు జీవీఎంసీ ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతాల్లో ఈ నెల 17వ తేదీ వరకు నలుగురు పర్యవేక్షక ఇంజినీర్లు నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం ఉన్న పారిశుధ్య కార్మికులతో పాటు అదనంగా 650 మంది కార్మికులను నియమించారు. ఆయా ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలతో పాటు ఏడు క్రేన్లను సిద్ధం చేశారు. పూజా సామగ్రి సముద్రంలో కలపకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని నగర ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

అప్పన్న సేవలో పరిపూర్ణానంద సరస్వతి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శనివారం కాకినాడలోని శ్రీ పీఠం అధిపతి పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్ప స్తంభానికి మొక్కుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి.. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికలను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి స్వామీజీకి అందించారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న పరిపూర్ణానంద సరస్వతి

జీవీఎంసీ సర్వసభ్య సమావేశం రద్దు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 10న నిర్వహించాల్సిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశం రద్దు చేసినట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. విజయవాడ వరద ముప్పు ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగుల, పారిశుధ్య కార్మికులు సహాయక చర్యల్లో పాల్గొన్న నేపథ్యంలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియజేస్తామన్నారు.



59వ వార్డు నక్కవానిపాలెంలో 75 అడుగుల బెల్లం వినాయకుడు



పాత వెంకోజీపాలెంలో క్యారమ్స్ ఆడుతున్న వినాయకుడు



నీలమ్మవేప చెట్టు వద్ద నవగ్రహాల మధ్యలో ఆదిత్య గణపతి



గాజువాకలో 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి

మహా గణపతి.. మనసాస్మరామి

భక్తులను ఆకట్టుకుంటున్న గణనాథులు • భారీ సెట్టింగ్‌లతో మండపాలు

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి మండపమూ ఒక కళాఖండంగా దర్శనమిస్తోంది. వినాయకుడి వివిధ రూపాలను ఆవిష్కరించిన శిల్పుల కళా నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంటోంది. మండపాల ముఖద్వారాలు కూడా అద్భుతమైన అలంకరణలతో కనువిందు చేస్తున్నాయి. మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు, భారీ సెట్టింగ్‌లతో కోలాహలం నెలకొంది. భక్తులు వినాయకుడి విగ్రహాలను అత్యంత భక్తి శ్రద్ధలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



పెదజాలారిపేటలో పాఠాలు బోధిస్తున్న గణేశుడు



జాలారిపేటలో బర్త్‌డే బాయ్‌గా గణనాథుడు



కొబ్బరితోటలో గొర్రెల కాపరిగా విఘ్నేశ్వరుడు



అడవివరంలోని శిడగం వీధిలో కొలువుదీరిన గణనాథుడు

కొండవాలులో సీపీ పర్యటన


టార్చ్ లైట్ వెలుతురులో బిలాల్‌కాలనీలో పర్యటిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ


తుపాను పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడ్డాయి. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆయా ప్రాంతాలను సందర్శించారు. అధికారులను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టారు. కొండవాలు ప్రాంతాలు, ముంపునకు అవకాశం ఉన్న ప్రాంతాలలో పరిస్థితులను పర్యవేక్షించారు. గోపాలపట్నం స్టేషన్ పరిధిలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి వెళ్లి ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వాగు పొంగిపొర్లడంతో అక్కడకు వెళ్లి పరిశీలించారు. ప్రమాద తీవ్రత పెరిగితే తక్షణం సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బిలాల్ కాలనీలో..

సీతమ్మధార: సీతమ్మధార ప్రాంతంలోని బిలాల్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్ కొండ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యటించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో పరిస్థితుల్లో ఆందోళనకరంగా మారాయి. ఈ నేపథ్యంలో 108 అడుగుల ఆభయాంజనేయ ఆలయం రోడ్డులో టార్చ్ లైట్ వెలుతురులో ఆయన కొండవాలు ప్రాంతాలను పరిశీలించారు. సీఐ డి.వెంకటరమణ, ఎస్‌ఐ, శ్రీను, స్పెషల్ బ్రాంచ్ నాయుడు పాల్గొన్నారు.

అల్లకల్లోలంగా సముద్రం


ఎగిసిపడుతున్న అలలు

బీచ్‌రోడ్డు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. విశాఖ సాగరతీరంలో ఆదివారం భారీ ఎత్తున అలలు ఎగిసిపడ్డాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో సముద్రంలోని నీరు రంగు మారింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. సముద్రం తీరానికి ఎవరూ వెళ్లవద్దని, తీర ప్రాంతాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు.

కూలిన పాత పాఠశాల భవనం


కూలిపోయిన పాఠశాల భవనం

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస-అగ్రహారంలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం కూలిపోయింది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పదేళ్ల నుంచి తరగతులు నిర్వహించడంలేదు. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఒక్క సారిగా కుప్ప కూలిపోయింది. ఇందులో స్థానికులు పశువులను కట్టేవారు. ఉదయం పశువులను మేతకు తోలుకు వెళ్లిన తరువాత భవనం కూలిపోవడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట: బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో గెడ్డలు భారీ ఎత్తున ప్రవహిస్తున్నాయని ప్రజలు ఎవరూ గెడ్డలు దాటవద్దని చెప్పారు. పశువులు, మేకలు వారి వారి పాకల్లోనే ఉంచుకునేలా రైతులు జాగ్రత్తలు పడాలని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు చెట్ల కింద ఉండొద్దని ప్రజలకు సూచించారు. పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గజనాధుని ఉత్సవాలు జరుగుతున్నాయని నిమజ్జన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బుడి బుడి అడుగులు వేయాల్సిన వయసులోనే బ్రేక్ డ్యాన్స్‌తో అదరగొట్టిన కార్తికేయ రెడ్డి.. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలను షేక్ చేస్తున్నాడు. వినాయక చవితి పందిరి వద్ద తొలిసారి డ్యాన్స్ చేసిన ఈ బుడ్డోడు.. మోడలింగ్ రంగంలోనూ అడుగుపెట్టి ర్యాంప్‌లపై రాక్ చేస్తున్నాడు. తాజాగా థాయ్‌లాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్(జేఎంఐ) పోటీల్లో భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించి 'ప్రిన్స్ వరల్డ్-2024'టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. 4వ తరగతి చదువుతున్న కార్తికేయ రెడ్డి వ్యాఖ్యానం, నటన, కథలు చెప్పడం, యోగా ఇలా అనేక రంగాల్లో ప్రతిభ చూపిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందాడు. చిన్న వయసులోనే ఎన్నో అవార్డులు గెలుచుకుని తన ప్రతిభను చాటుతున్నాడు. -సీతమ్మధార

సకల కళా కార్తికేయ

- బుడి బుడి అడుగుల వయసులోనే బ్రేక్ డ్యాన్సులు
- మోడలింగ్‌లో అంతర్జాతీయ వేదికలపై మెరుపులు
- వ్యాఖ్యానం, నటన, యోగా రంగాల్లో రాణింపు




అవార్డులతో కార్తికేయరెడ్డి

థాయ్‌లాండ్‌లో 'ప్రిన్స్'కిరీటం


థాయ్‌లాండ్‌లో ప్రదర్శన ఇస్తున్న కార్తికేయ

రాష్ట్ర స్థాయిలో జరిగిన స్టార్ కిడ్స్ సీజన్-2లో కార్తికేయ రెడ్డి సత్తా చాటాడు. ఆంధ్రా ఫ్యాషన్ వీక్ పోటీల్లో విజేతగా నిలిచాడు. కాలికట్‌లో జరిగిన జాతీయ స్థాయి మోడలింగ్ పోటీల్లో విజయం సాధించాడు. ప్రిన్స్ ఆఫ్ ఏపీ సబ్ టైటిల్‌ను గెలిచి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల థాయ్‌లాండ్‌లో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పేరుతో పోటీలు నిర్వహించగా.. 11 దేశాల నుంచి 45 మంది చిన్నారులు పోటీ పడ్డారు. ఇందులో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన కార్తికేయ విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేశాడు. ఈ పోటీల్లో ప్రిన్స్ వరల్డ్-2024 టైటిల్‌ను గెలుచుకున్నాడు. డ్యాన్స్, మోడలింగ్ రంగంలో సత్తా చాటుతున్న కార్తికేయ ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని 'సాక్షి'కి చెప్పాడు.

ఇద్దరూ ఇద్దరే

అక్కా తమ్ముళ్లు ఇద్దరూ ఇద్దరే.. తమ్ముడు కార్తికేయ రెడ్డి డ్యాన్స్, మోడలింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. నారాయణ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న శ్రేయసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. 34 శ్లోకాల సమాహారమైన 'శ్యామల దండకం' వల్లించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. చిత్రలేఖనంతో పాటు పాటల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకుంది. 2024లో ఉగాది ప్రతిభా పురస్కారం అందుకుంది.

రెండేళ్లకే బ్రేక్ డ్యాన్స్‌లు : బుడి బుడి అడుగులు వేసే రెండేళ్ల వయసులోనే కార్తికేయ బ్రేక్ డ్యాన్స్‌లతో అదరగొట్టాడు. గాజువాకలో లెజెండ్ అపార్టుమెంట్‌లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. ఆ సమయంలో రెండో ఏటలో అడుగు పెట్టిన కార్తికేయ తొలిసారిగా చేసిన డ్యాన్స్‌కు అపార్ట్‌మెంట్ వాసులంతా ఫిదా అయిపోయారు. కొన్నాళ్లకు ప్లే స్కూల్‌లో అడుగుపెట్టాడు. అక్కడ పిల్లలందరూ ఏడుస్తూ ఉంటే.. ఈ చిచ్చర పిడుగు మాత్రం డ్యాన్సులతో దుమ్మురేపేవాడు. దీంతో తల్లిదండ్రులు కార్తికేయను మంచి డ్యాన్సర్‌ను చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే మూడో ఏట కాలికి శస్త్రచికిత్స అవడంతో ఏడాది పాటు డ్యాన్స్‌కు దూరమైన ఈ చిన్నోడు.. పడిలేచిన కెరటంలా మళ్లీ డ్యాన్స్ ఫ్లోర్ ఎక్కాడు. పాశ్చాత్య నృత్యాన్ని అభ్యసించాడు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

ప్రస్తుతం టింపనీ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న కార్తికేయ బహుముఖ ప్రజ్ఞాశాలిగా విద్యతో పాటు అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. స్కూల్‌లో జరిగే కల్చరల్ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ.. తన వాక్చాతుర్యంతో అందరినీ అలరిస్తున్నాడు. ఆయన నటించిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయానికి అందరూ మంత్రముగ్ధులయ్యారు. రాగయుక్తంగా శ్లోకాలు, గీతాలు పాడి అందరి అభినందనలు అందుకున్నాడు. ఫ్యాషన్ షోలో కూడా అందరినీ ఆకట్టుకుంటున్నాడు. దీంతో అతని తల్లిదండ్రులు మోడలింగ్ రంగంలోనూ కార్తికేయను ప్రోత్సహిస్తున్నారు. ఒక వైపు డ్యాన్సర్‌గా.. మరో వైపు మోడల్‌గా పలు రాష్ట్రాల్లో షోలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం

కార్తికేయ రెడ్డి తండ్రి బి.జె.శ్రీనివాసరెడ్డి ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఖాళీ సమయంలో కథలు, కవితలు, వెబ్ పేజీలకు ఆర్టికల్స్ రాస్తుంటారు. ప్రతి ఆదివారం అనకాపల్లి జిల్లా పరవాడలోని ఎకరా పొలంలో సేంద్రియ వ్యవసాయం చేస్తుంటారు. కల్తీ లేని ఆహారం అందించాలన్న లక్ష్యంతో డ్రాగన్ ఫ్రూట్, మామిడి, బొప్పాయి, స్టార్ ఫ్రూట్, లిచీతో పాటు తేనెటీగల పెంపకం చేస్తుంటారు. ఆయన తల్లి పావనీ లత భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)లో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చిత్రకారిణి. కార్తికేయ రెడ్డి ఫ్యాషన్ షోల్లో వేసుకునే దుస్తులు, ఇతర వస్తువులను ఆమే డిజైన్ చేస్తుంటారు. శీలానగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఈ దంపతులకు హరి శ్రేయసి రెడ్డి, కార్తికేయ రెడ్డి అనే ఇద్దరు పిల్లలున్నారు. పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా తల్లిదండ్రులిద్దరూ ప్రోత్సహిస్తున్నారు. ఈ కుటుంబం తమ సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.


తల్లిదండ్రులతో కార్తికేయ, శ్రేయసి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి


మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

దాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించేలా నిర్ణయం తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె అయోధ్యరాము, ప్రధాన కార్యదర్శి యూ రామస్వామి కోరారు. మంగళవారం నిర్వహించే స్టీల్ మంత్రిత్వశాఖ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించి, ప్లాంట్ కోలుకోలేని దెబ్బ తీయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి చేసేందుకు 5 ఫర్నేస్‌లు ఉండగా ఒకటి మాత్రమే నడపాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది అత్యంత ప్రమాదకరమని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పూర్తి సామర్థ్యంతో నడిపే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఉత్పత్తి తగ్గించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రవేటీకరణ ఆపి, సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడపాలని తదితర డిమాండ్లు చేస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం: ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా నడుస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో నడుస్తుందన్నారు.

వర్షంలోనూ సైక్లోథాన్


జోరు వానలోనూ సాగుతున్న సైక్లింగ్


సైక్లోథాన్‌లో పాల్గొన్న నావికాదళ సైక్లిస్టులు

విశాఖ స్పోర్ట్స్: ప్రతికూల వాతావరణంలో.. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నావికాదళ సైక్లిస్టులు బీచ్‌రోడ్డులో కండిషనింగ్ క్యాంప్‌లో పాల్గొన్నారు. వైజాగ్ నేవీ మారథాన్ కండిషనింగ్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం సైక్లోథాన్ జరిగింది. ఐఎన్ఎస్ కళింగ ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ నుంచి కళింగ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సైక్లిస్టులు పాల్గొన్నారు. మరో 90 రోజుల్లో సాగరతీరంలో మారథాన్ జరగనుండగా.. ఫిట్‌నెస్ చాలెంజ్‌గా తూర్పు నావికాదళం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు.

'వక్ఫ్ చట్టాన్ని సవరిస్తే ఊరుకోం'


ముస్లింలకు సంఘీభావం తెలుపుతున్న నగర వామపక్ష, నాయకులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి 41 సవరణలు చేసిందని.. దీని వల్ల ముస్లిం ఆస్తులు, ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని ముస్లిం పెద్దలు, మేధావులు, అఖిల పక్ష నేతలు అన్నారు. వెంటనే ఈ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే న్యూకాలనీలోని ఓ హోటల్‌లో అఖిల పక్ష నాయకులతో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం కమ్యూనిటీ జిల్లా నాయకుడు షేక్ అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ కేంద్రం ఈ బిల్లు తీసుకొచ్చి.. తమ పూర్వీకుల ఆస్తులపై తమకు హక్కులు లేకుండా చేయడం బాధాకరమన్నారు. వక్ఫ్ అనగా దానమని.. అల్లా పేరున 11వ శతాబ్దంలోనే చక్రవర్తులు ధనికుల ఇళ్ల స్థలాలను అల్లా పేరున వక్ఫ్ చేశారని గుర్తు చేశారు. దేశంలో సుమారు 9.4 లక్షల ఎకరాల సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఆస్తులు ఉన్నాయని తెలిపారు. వీటిలో కొన్ని వేల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో విపక్షాలు వ్యతిరేకించాయని తెలిపారు. ఈ బిల్లు వల్ల ముస్లిం సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సీపీఎం నాయకుడు అజయ్‌శర్మ, పీవోడబ్ల్యూ ప్రతినిధి లక్ష్మి, నాయకులు కత్తి పద్మ, మునీర్, అష్రాఫ్, హైదర్ అలీ సింకా తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌పై కత్తితో దాడి

అల్లిపురం: రౌడీ షీటర్‌పై దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహారాణిపేట సీఐ వి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తాడివీధికి చెందిన మాడుగుల కిరణ్‌కుమార్, అనిల్ ఇద్దరు టిఫిన్ కోసం ద్విచక్రవాహనంపై వెళ్లారు. టిఫిన్ తీసుకుని వస్తుండగా తాడివీధి వద్ద వినాయక నియజ్జనం ఊరేగింపు జరుగుతుంది. ద్విచక్రవాహనంపై వస్తున్న కిరణ్‌కుమార్, అనిల్‌లను సురేష్, పెదభాను, చిన భాను, అభి అడ్డగించారు. పాత కక్షల కారణంగా వారు కూరగాయల కత్తితో దాడికి పాల్పడ్డారు. దాడిలో కిరణ్‌కుమార్ గాయపడ్డాడు. ఈ విషయాన్ని రౌడీ షీటర్ సతీష్‌కు అనిల్ తెలియజేసి కిరణ్‌ను ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని గొడవ జరిగిన విషయంపై ఆరా తీయగా వెంకటరమణ, ఆకుల ఉదయ్‌కుమార్ సతీష్‌పై చాకుతో దాడికి పాల్పడ్డారు. గాయపడి సతీష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిరణ్‌కుమార్, సతీష్ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆరుగురిపై కేసు నమోదు చేసి, ఐదుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరొకరు కోసం గాలిస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల మానవత్వం

- తోటి కార్మికుడి అంత్యక్రియలు నిర్వహణ

మల్కాపురం: ఓ పారిశుధ్య కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి నా అన్న వారు ఎవరూ లేకపోవడంతో.. తోటి పారిశుధ్య కార్మికులే దహన సంస్కారాలు నిర్వహించారు. వివరాలివీ.. జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీకి చెందిన ఒ.అప్పనాయుడు(56) పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యం సేవించే అలవాటున్న అతను బ్లడ్ క్యాన్సర్‌తో కొంత కాలంగా బాధపడుతున్నాడు. విధులు అనంతరం 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద గల మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న హకర్స్ జోన్ వద్ద నిద్రిస్తుంటాడు. శనివారం సాయంత్రం అక్కడే నిద్రించిన అప్పలనాయుడు ఆదివారం కదలిక లేకపోవడంతో తోటి కార్మికులు గమనించారు. తొలుత మద్యం మత్తులో ఉంటాడని భావించారు. ఆ తర్వాత ఆయన నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఈ విషయాన్ని మల్కాపురం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి వచ్చి మృతుడి వివరాలను సేకరించారు. సహజ మరణంగా నిర్ధారించారు. అయితే ఆయన దహన కార్యక్రమాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో.. తోటి పారిశుధ్య కార్మికులే మానవత దృక్పథంలో స్పందించారు. స్థానిక శ్మశానవాటికలో అప్పలనాయుడు దహన సంస్కారాలు పూర్తి చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సిన్

మహారాణిపేట: జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 9 నుంచి 14 ఏళ్లలోపు ఆడ పిల్లలకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) నిరోధక వ్యాక్సిన్ వేయించేందుకు చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ ముందుకొచ్చారు. సుమారు రూ.4 వేల విలువ చేసే ఈ వ్యాక్సిన్‌ను రెండు డోసుల్లో తొలి దశలో 50 మంది ఆడపిల్లలకు ఉచితంగా అందిస్తారు. ఆడ పిల్లలు పెద్దయ్యాక గర్భాశయ క్యాన్సర్‌ను నిరోధించడంలో ఈ వ్యాక్సిన్ ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఆసక్తి గల జర్నలిస్టులు తమ పిల్లల వివరాలను 98491 47350, 98482 91749కు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ జిల్లా యూనిట్ ఓ ప్రకటనలో కోరింది.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,870
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,800
వెండి(కిలో):	రూ.89,500

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190